ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5

తమిళనాడు
TAMILNADU
సోమవారం 11 మార్చి 2024

40 చోట్లా మనదే గెలుపు

- ఆ దిశగా శ్రమిద్దాం
- పార్టీ శ్రేణులకు స్టాలిన్ లేఖ



అడయార్, మార్చి 10: తమిళనాడు, పుదుచ్చేరిలోని 40 నియోజకవర్గాల్లో ఎంకే స్టాలిన్ అనే అభ్యర్థి పోటీ చేస్తున్నారనే విషయాన్ని ప్రతి ఒక్క కార్యకర్త మనసులో పెట్టుకుని, ఆయా స్థానాల్లో విజయం సాధించే దిశగా కృషి చేయాలని కార్యకర్తలకు డీఎంకే అధినేత పిలుపునిచ్చారు. డీఎంకే సారథ్యంలోని 'ఇండియా' కూటమి తరఫున డీఎంకే, కాంగ్రెస్, ఎండీఎంకే, వీసీకే, ఉభయ కమ్యూనిస్టులు, ఇండియన్ ముస్లిం లీగ్ పార్టీలకు చెందిన అభ్యర్థులు తమిళనాడులోని 39 ఎంపీ సీట్లలోనూ, పుదుచ్చేరిలోని ఒక్క లోక్‌సభలో పోటీ చేస్తున్నారు. ఈ అభ్యర్థుల విజయం కోసం కృషి చేయాలని స్టాలిన్ పిలుపునిస్తూ, ఆదివారం ఓ లేఖ రాశారు. రానున్న లోక్‌సభ ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీని ఓడించడమే లక్ష్యం కాదని, గత పదేళ్లుగా దేశంలో సాగుతున్న ప్రజా వ్యతిరేక నియంత పాలనకు చరమగీతం పాడాలని పిలుపునిచ్చారు. బీజేపీ శ్రేణులు 'మళ్లీ మోదీ' అనే నినాదంతో ప్రజల్లోకి వెళ్తున్నారని, ఇండియా కూటమి నేతలు 'మోదీ వద్దు' అనే నినాదంతో ప్రజల్లోకి చొచ్చుకెళ్లాలని దిశా నిర్దేశం చేశారు. ఇందుకోసం ఇండియా కూటమి నేతలు దేశంలోని తమ భాగస్వామ్య పార్టీలతో సుహృద్భావ వాతావరణంలో సీట్ల పంపిణీపై చర్చలు జరిపి శాంతియుతంగా పూర్తి చేశారన్నారు. తమిళనాడు, పుదుచ్చేరి రాష్ట్రాల్లో డీఎంకే సారథ్యంలోని ఇండియా కూటమిలో డీఎంకే, కాంగ్రెస్, సీపీఐ, సీపీఎం, ఎండీఎంకే, వీసీకే, ఇండియన్ ముస్లిం లీగ్ పార్టీలు ఉన్నాయని, 40 లోక్‌సభ స్థానాల్లో అన్ని పార్టీలకు చెందిన అభ్యర్థులు పోటీ చేస్తున్నారని తెలిపారు. ఈ స్థానాల్లో పోటీ చేసే అభ్యర్థులందరూ ఎంకే స్టాలిన్ అని భావించి ఆ అభ్యర్థుల విజయం కోసం కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ ఎన్నికల్లో బీజేపీ సారథ్యంలోని కేంద్ర ప్రభుత్వాన్ని కూకటి వేళ్లతో పెకలించి, ఇండియా కూటమి సారథ్యంలో ప్రజా ప్రభుత్వం ఏర్పాటు చేసి, సమన్యాయం, సమానత్వం, సహోదరతత్వం, రాష్ట్ర హక్కుల పరిరక్షణ, అణగారిన వర్గాల ప్రజల పురోగతి కోసం పాటు పడేందుకు కృషి చేయాలని కోరారు. సాధారణంగా ప్రతి ఎన్నికలకు ముందుకు పొత్తులు మారిపోతుంటాయన్నారు. కానీ, తమ కూటమిలోని పార్టీలన్నీ ఒకే లక్ష్యంతో ముందుకు సాగుతున్నాయని గుర్తు చేశారు. అదే.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దించడమే ఏకైక లక్ష్యంగా కొనసాగుతుందని పేర్కొన్నారు. అందువల్ల వచ్చే ఎన్నికల్లో తమిళనాడు, పుదుచ్చేరి రాష్ట్రాల్లోని 40 లోక్‌సభ స్థానాల్లో తానే పోటీ చేస్తున్నాననే భావనతో ఇండియా కూటమి తరఫున బరిలోని నిలిచిన ప్రతి అభ్యర్థినీ గెలిపించాలని స్టాలిన్ పేర్కొన్నారు.

నేడు ధర్మపురి పర్యటన...

ముఖ్యమంత్రి స్టాలిన్ సోమవారం ధర్మపురి జిల్లా పర్యటనకు వెళ్లనున్నారు. ఈ సందర్భంగా జిల్లా కేంద్రంలోని ప్రభుత్వం కాలేజీలో జరిగే కార్యక్రమంలో పాల్గొని ధర్మపురి, కృష్ణగిరి, సేలం జిల్లాల్లో చేపట్టనున్న వివిధ రకాలైన అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేస్తారు. ఇందుకోసం ఆయన సోమవారం ఉదయం 9 గంటలకు విమానంలో చెన్నై నుంచి బయలు దేరి ఉదయం 10 గంటలకు సేలం చేరుకుంటారు. అక్కడి నుంచి రోడ్డు మార్గంలో ధర్మపురి ఆర్ట్స్ కాలేజీకి చేరుకుని, ప్రభుత్వ కార్యక్రమంలో పాల్గొంటారు. ఉదయం 11.23 గంటలకు సేలం అంబాపేట క్యాన్సర్ ఆస్పత్రిని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రారంభిస్తారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఆరోగ్య మంత్రి ఎం.సుబ్రమణ్యం పాల్గొంటారు. 12 గంటలకు పాఠశాల విద్యార్థులకు సంక్షేమ సహాయాలను పంపిణీ చేస్తారు. ఆ తర్వాత అక్కడినుంచి రోడ్డు మార్గంలో సేలం విమానాశ్రయానికి చేరుకుని, సాయంత్రానికి చెన్నైకు వస్తారు.

అభ్యర్థుల ఎంపికకు

జోరుగా ఇంటర్వ్యూలు

చెన్నై, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తుండటంతో అటు అధికార పక్షం డీఎంకే కార్యాలయం అరివాయలంలో, ఇటు ప్రధాన ప్రతిపక్షం అన్నాడీఎంకే కార్యాలయం ఎంజీఆర్ మాళిగైలో అభ్యర్థుల ఎంపిక కోసం జోరుగా ఇంటర్వ్యూలు కొనసాగుతున్నాయి. రెండు పార్టీల్లో పోటీ చేయడానికి దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు ఈ ఇంటర్వ్యూలకు హాజరవుతున్నారు. డీఎంకే ఆధ్వర్యంలో ఈ నెల 1వ తేదీనుంచి ఆశావహుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. తూత్తుకుడి నియోజకవర్గంలో పోటీ చేయడానికి కనిమొళి, శ్రీపెరుంబుదూరులో పోటీకి టీఆర్‌బాలు, వేలూరులో పోటీకి మంత్రి దురైమురుగన్ తనయుడు కదిర్‌ఆనంద్ దరఖాస్తు చేసుకున్న విషయం విదితమే. ఇదే విధంగా పెరంబలూరులో పోటీ చేయడానికి మంత్రి కేఎన్ నెహ్రూ కుమారుడు అరుణ్, తిరునల్వేలిలో పోటీ చేయడానికి స్పీకర్ అప్పావు కుమారుడు అలెక్స్, భారత్ స్కాన్స్ అధినేత ఇమ్మానుయేల్ దరఖాస్తులు సమర్పించారు. కనిమొళి, దయానిధి మారన్, టీఆర్‌బాలు, ఎ.రాజా తదితరులు దరఖాస్తులు సమర్పించారు. సుమారు మూడువేల దరఖాస్తులు అందినట్లు డీఎంకే అధిష్ఠానం ప్రకటించింది. ఇక ఇంటర్వ్యూలకు హాజరయ్యే ఆశావహుల మద్దతుదారులంతా శనివారం రాత్రే చెన్నైకి చేరుకున్నారు. అదే సమయంలో డీఎంకే కూటమిలో సీట్ల పంపకాలు పూర్తి కావడంతో ఆదివారం ఉదయం 9.45 గంటలకు ఆ పార్టీ అధ్యక్షుడు స్టాలిన్, ఎంపీ టీఆర్‌బాలు, సీనియర్ మంత్రి దురైమురుగన్ అరివాలయంలో ఆశావహుల వద్ద ఇంటర్వ్యూలు జరిపారు. తొలుత కన్నియాకుమారిలో పోటీ చేయడానికి దరఖాస్తులు సమర్పించినవారికి ఇంటర్వ్యూలు నిర్వహించారు. ప్రతి ఒక్కరి వద్దా ఆయా నియోజకవర్గాల్లో పార్టీ పరిస్థితి, సీనియారిటీ, పార్టీ కోసం పాటుపడుతున్నారో అడిగి తెలుసుకున్నారు. అదే విధంగా నియోజకవర్గంలో వారికున్న అంగబలం, అర్థబలం గురించి కూడా తెలుసుకున్నారు. ఆ తర్వాత కృష్ణగిరి, సేలం, ధర్మపురి నియోజకవర్గాల ఆశావహులకు ఇంటర్వ్యూలు జరిగాయి. అటు పిమ్మట తూత్తుకుడి నియోజకవర్గం ఆశావహులకు నిర్వహించిన ఇంటర్వ్యూకు తొలుత సిట్టింగ్ ఎంపీ కనిమొళి హాజరయ్యారు. ఆమెకు మద్దతుగా ఆ జిల్లాకు చెందిన మంత్రులు గీతా జీవన్, అనితా రాధాకృష్ణన్ కూడా హాజరై నియోజకవర్గంలో పార్టీ పరిస్థితి గురించి స్టాలిన్‌కు వివరించారు.



తూత్తుకుడి ఎంపీ కనిమొళి, ఆమె మద్దతుదారులు గీతాజీవన్, అనితా రాధాకృష్ణన్‌ను ఇంటర్వ్యూ చేస్తున్న డీఎంకే అధ్యక్షుడు స్టాలిన్, దురైమురుగన్, టీఆర్ బాలు తదితరులు

అన్నాడీఎంకేలో...

అన్నాడీఎంకే ప్రధాన కార్యాలయం ఎంజీఆర్ మాళిగైలో ఆశావహులకు ఇంటర్వ్యూలు ఆదివారం ఉదయం నుంచి ప్రారంభమయ్యాయి. అన్నాడీఎంకే తరఫున పోటీ చేయడానికి వివిధ నియోజకవర్గాల నుంచి 2475 మంది ఆశావహులు దరఖాస్తులు సమర్పించారు. వీరందరికి ఇంటర్వ్యూలకు హాజరు కావాల్సిన తేదీలు, సమయం గురించి పార్టీ అధిష్ఠానం లేఖలు పంపింది. ఆ ప్రకారం ఆదివారం చెన్నై నగర పరిధిలో ఉన్న మూడు లోక్‌సభ నియోజకవర్గాల్లో పోటీకి దరఖాస్తు చేసుకున్న వారికి ఇంటర్వ్యూలు జరిగాయి. ఉదయం నుంచి మధ్యాహ్నం 1గంట వరకు నార్త్ చెన్నై, సెంట్రల్ చెన్నై, సౌత్ చెన్నై, కాంచీపురం, తిరువళ్లూరు సహా పది నియోజకవర్గాల ఆశావహులకు అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి, పార్టీ సీనియర్ నేతలు నత్తం విశ్వనాథన్, దిండుగల్ శీనివాసన్, కేపీ మునుసామి, వేలుమణి ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఇక మధ్యాహ్నం నుంచి సాయంత్రం దాకా తిరువణ్ణామలై, అరణి, కోయంబత్తూరు, నీలగిరి సహా 10 నియోజకవర్గాలకు చెందిన ఆశావహులకు ఇంటర్వ్యూలు జరిగాయి. అంగ, అర్థబలాలు, గెలుపు అవకాశాలు గురించి ఎడప్పాడి, పార్టీ సీనియర్ నేతలు అడిగి తెలుసుకున్నారు. ఇలా డీఎంకే, అన్నాడీఎంకే పోటీపడి ఆశావహులకు ఇంటర్వ్యూలు నిర్వహించడంతో రెండు పార్టీల ప్రధాన కార్యాలయాల వద్ద వివిధ జిల్లాల నుంచి వచ్చిన జిల్లా నేతలు, పార్టీ ప్రముఖులు, కార్యకర్తలు గుమికూడటంతో సందడిగా మారింది.



మహిళను ఇంటర్వ్యూ చేస్తున్న అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి తదితరులు

ఆగని శ్రీలంక నావికాదళం ఆగడాలు

- 22 మంది జాలర్ల నిర్బంధం
- 3 మర బోట్లు స్వాధీనం

అడయార్, మార్చి 10: భారత అంతర్జాతీయ సముద్ర జలాల సరిహద్దులను దాటినందుకు రాష్ట్రానికి చెందిన 22 మంది రాష్ట్ర జాలర్లను శ్రీలంక నావికాదాళం అరెస్టు చేసింది. వీరు ఉపయోగించిన మూడు మర బోట్లను కూడా స్వాధీనం చేసుకున్నారు. పుదుక్కోట జిల్లా జగదాభిపట్టణంకు చెందిన పద్మనాభన్ అనే వ్యక్తి ఈ నెల 9వ తేదీన సహచర జాలర్లు కాళియప్పన్, అసిలన్, కోడిమారి షేక్ అబ్దుల్లా, తంగరాజ్, జయరామన్‌లతో సహా అనేక మందితో సముద్రంలోకి చేపల వేటకు వెళ్లారు. అలాగే, ఇదే ప్రాంతానికి చెందిన సెల్వరాజ్ అనే వ్యక్తికి చెందిన మర బోటులో శరవణన్‌తో సహా మరికొందరు వెళ్లారు. వీరంతా ఆదివారం తెల్లవారుజామున ఆగ్నేయ బంగాళాఖాతంలో చేపల వేట కొనసాగిస్తుండగా గస్తీ విధుల నిర్వహణలో భాగంగా అటువైపు వచ్చిన శ్రీలంక నావికాదళం ఈ జాలర్లను చూసి వారిని చుట్టుముట్టింది. అక్కడ రెండు మరపడవల్లో చేపల వేట కొనసాగిస్తున్న జాలర్లను అదుపులోకి తీసుకుంది. అలాగే, వారు ఉపయోగించిన మరబోట్లను కూడా స్వాధీనం చేసుకుంది. అదేవిధంగా కారైక్కాల్ చేపల హార్బర్ నుంచి సముద్రంలోకి చేపల వేటకు వెళ్ళిన కందస్వామి (43) నేతృత్వంలోని జాలర్ల బృందాన్ని కూడా అదుపులోకి తీసుకుంది. ఈ రెండు సంఘటనల్లో మొత్తం 22 మందిని శ్రీలంక నావికాదళం అదుపులోకి తీసుకుంది. వీరందరినీ కొలంబోకు తీసుకెళ్ళింది. కాగా, అరెస్టు చేసిన జాలర్లను విడుదల చేయాలని బాధిత కుటుంబ సభ్యులు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేశారు.

లోక్‌సభ ఎన్నికలపై నిఘాకు 192 బృందాలు

చెన్నై, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): చెన్నై జిల్లా పరిధిలో మూడు లోక్‌సభ నియోజకవర్గాలకు జరుగనున్న ఎన్నికలపై నిఘా వేయడానికి 192 బృందాలు ఏర్పాటు చేస్తున్నట్లు ఎన్నికల సంఘం అధికారులు తెలిపారు. ఎన్నికల నోటిఫికేషన్ జారీ అయిన తర్వాత ఫ్లయింగ్ స్క్వాడ్, నగదు బట్వాడా నిరోధక స్క్వాడ్, ఎన్నికల అక్రమాలపై వీడియో స్క్వాడ్, వాహనాల తనిఖీ స్క్వాడ్ అంటూ 192 బృందాలను రంగంలోకి దింపనున్నట్లు పేర్కొన్నారు. ప్రతి స్క్వాడ్‌లో కనీసం 48 మంది సభ్యులు ఉంటారని తెలిపారు. ఈ స్క్వాడ్‌లలో పని చేయడానికి ఎంపికైనవారందరికీ రిప్పన్‌భవనంలో శిక్షణ కార్యక్రమాలు జరుగుతున్నాయని చెప్పారు. ఎన్నికల నియమావళి అమలులో ఉన్నప్పుడు వాహనాల్లో రూ.50వేలకు మించి నగదును తీసుకెళ్లకూడదని, అంతకు మించి నగదును తగిన రశీదులు లేకుండా తీసుకెళితే స్వాధీనం చేసుకుని ఐటీ అధికారులకు అప్పగిస్తారని చెప్పారు.



వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

ఓటమి భయంతోనే

డీఎంకే కూటమిలోకి కమల్

- కేంద్ర మంత్రి మురుగన్



ఊటీలో విలేకరులతో మాట్లాడుతున్న మురుగన్

చెన్నై, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): ఏ కూటమిలో చేరినా ఓటమి ఖాయమనే భయంతోనే మక్కల్ నీదిమయ్యం నాయకుడు కమలహాసన్ అవినీతి అక్రమాలకు నెలవైన డీఎంకే కూటమిలో చేరి ఆ పార్టీ అవినీతికి గట్టి మద్దతు ప్రకటించారని కేంద్రమంత్రి ఎల్.మురుగన్ విమర్శించారు. మధ్యప్రదేశ్ నుంచి రాజ్యసభకు ఎంపికైన తర్వాత తొలిసారిగా ఆదివారం ఉదయం ఊటీకి వెళ్లిన మురుగన్‌కు స్థానిక బీజేపీ నేతలు, కార్యకర్తలు స్వాగతం పలికారు. ఆ సందర్భంగా విలేకరులతో ఆయన మాట్లాడుతూ... రాష్ట్రంలో బీజేపీకి రోజురోజుకూ ప్రజల మద్దతు అధికమవుతోందని, లోక్‌సభ ఎన్నికల్లో మునుపటి కంటే ఎక్కువ సీట్లలో గెలుస్తామనే నమ్మకం కలుగుతోందని చెప్పారు. డీఎంకేలో అవినీతిపరుల సంఖ్య అధికమైందని, ఇటీవల మాదక ద్రవ్యాల అక్రమ రవాణా కేసులో డీఎంకే ప్రముఖుడు అరెస్టయ్యారని, ఈ విషయం వెలుగులోకి రాగానే స్టాలిన్ ఆయనను పార్టీ నుండి బహిష్కరించి ఏమి ఎరుగనట్లు ప్రవర్తిస్తున్నారని విమర్శించారు. డీఎంకే ఎంపీ రాజా, పర్యాటక శాఖ మంత్రి రామచంద్రన్ సహా ఆ పార్టీకి చెందిన 11 మందిపై అవినీతి కేసులు నమోదై ఉన్నాయని చెప్పారు. రాష్ట్రంలో డీఎంకేకు చెందిన కౌన్సిలర్ స్థాయి నుండి జిల్లా శాఖ అధ్యక్షుల వరకూ అందరూ అవినీతి అక్రమాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. కొన్ని కార్పొరేషన్లు, మునిసిపాలిటీల్లో డీఎంకే కౌన్సిలర్లపై ఆ పార్టీ కౌన్సిలర్లే ఆరోపణలు చేస్తున్నారని ఆయన చెప్పారు. మక్కల్ నీదిమయ్యం నేత కమల్ పార్టీని ప్రారంభించినప్పటి నుంచి ప్రతి ఎన్నికల్లోనూ ప్రజలతోనే పొత్తుపెట్టుకుని పోటీ చేస్తానని, అవినీతికి చిరునామాగా ఉన్న ద్రావిడ పార్టీలతో పొత్తు పెట్టుకోనంటూ గొప్పలు చెప్పుకున్నారని, ప్రస్తుతం లోక్‌సభ ఎన్నికల్లో డీఎంకే కూటమిలో ఒక సీటు కూడా సంపాదించుకోకుండా వచ్చే యేడాది ఇచ్చే రాజ్యసభ సీటుకు ఆశపడి ఆ కూటమికి మద్దతు ప్రకటించడం సిగ్గుచేటన్నారు. బీజేపీ రాష్ట్ర నాయకుడు అన్నామలై పాదయాత్రకు ప్రజల నుంచి అపూర్వ స్పందన లభించిందని, ప్రధాని మోదీ రాకతో పార్టీ పరిస్థితి ఉన్నత స్థితికి చేరిందన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో మునుపటి కంటే ఎక్కువ సీట్లను గెలుచుకుంటామని మురుగన్ ధీమా వ్యక్తం చేశారు.

కమల్ అసలు రంగు బయటపడింది...

డీఎంకేతో పొత్తు పెట్టుకోవడంతో మక్కల్ నీదిమయ్యం నేత కమల్ అసలు రంగు ఏమిటో బయటపడిందని బీజేపీ శాసనసభ్యురాలు వానతి శ్రీనివాసన్ విమర్శించారు. లోక్‌సభ ఎన్నికల్లో తమ పార్టీ పోటీ చేస్తుందని, కోయంబత్తూరులో మళ్లీ పోటీకి దిగుతానని ప్రగల్భాలు పలికిన కమల్ ఆఖరి క్షణంలో డీఎంకే కూటమిలో చేరి పార్టీ శ్రేణులను మోసగించారని అన్నారు. త్వరలో శుభవార్త చెబుతానంటూ పార్టీ శ్రేణులకు హామీ ఇచ్చి చివరకు లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేయకుండా మిన్నకుండిపోవటం కమల్ స్వార్థానికి నిదర్శనమన్నారు. రాజ్యసభ సీటుకు ఆశపడి ఆయన డీఎంకేలో చేరారని ఆమె ఎద్దేవా చేశారు.

జాతీయ లోక్ అదాలత్‌లో

62,559 పెండింగ్ కేసుల పరిష్కారం

ప్యారీస్, మార్చి 10: రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో 62,559 పెండింగ్ కేసులను పరిష్కరించారు. మద్రాసు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి గంగాపూర్‌వాలా, రాష్ట్ర న్యాయపనుల కమిషన్ కమిటీ నిర్వాహక చైర్మన్ జస్టిస్ ఆర్.మహాదేవన్, హైకోర్టు న్యాయమూర్తులు ఎస్‌ఎస్ సుందర్ సూచనల మేరకు 2024 జనవరి నుంచి ఫిబ్రవరి వరకు న్యాయస్థానాల్లో పెండింగ్‌లో ఉన్న కేసులను లోక్ అదాలత్‌లో పరిష్కరింపజేసే కార్యక్రమం శనివారం జరిగింది. మద్రాసు హైకోర్టు న్యాయమూర్తులు జె.సత్యనారాయణ ప్రసాద్, బాలాజి, కలైమతి, రాజశేఖర్, సెంథిల్ మురుగన్, రిటైర్డ్ న్యాయమూర్తులు గోకుల్‌దాస్, జయపాల్ నేతృత్వంలో మొత్తం 8 బెంచ్‌లు, హైకోర్టు మదురై బెంచ్ న్యాయమూర్తులు ఎస్.మది, కేకే రామకృష్ణన్, రిటైర్డ్ జడ్జి చొక్కలింగంతో కూడిన మూడు బెంచ్‌లకు చెందిన న్యాయమూర్తులు పెండింగ్ కేసులపై విచారణ జరిపారు. అదే విధంగా కింద స్థాయి కోర్టుల్లో మొత్తం 482 బెంచ్‌లు కూడా పెండింగ్ కేసులపై విచారించాయి. ఇందులో రాష్ట్రవ్యాప్తంగా 62,559 కేసులను పరిష్కరింపజేసి, లబ్ధిదారులకు రూ.505 కోట్లా 78 లక్షలా 18 వేల 659 నష్టపరిహారం అందజేయాల్సిందిగా ఉత్తర్వులు జారీ అయ్యాయి.

మాదక ద్రవ్యాల నిరోధంలో ప్రభుత్వం విఫలం

- గవర్నర్‌కు ఈపీఎస్ ఫిర్యాదు

చెన్నై, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): మాదక ద్రవ్యాల నిరోధంలో ప్రభుత్వం విఫలమైందని, ఇంత జరుగుతున్నా డీఎంకే ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ప్రధాన ప్రతిపక్ష నేత, మాజీ సీఎం అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి, మాజీ ముఖ్యమంత్రి ఎడప్పాడి పళనిస్వామి ధ్వజమెత్తారు. ఆదివారం ఉదయం ఆయన పార్టీ సీనియర్ నేతలు కేపీ మునుసామి, తంగమణి, వేలుమణి, దిండుగల్ శీనివాసన్, డి. జయకుమార్ తదితరులతో రాజ్‌భవన్‌కు గవర్నర్ ఆర్ఎన్ రవిని ఆకస్మికంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో మాదక ద్రవ్యాల రవాణా పెరిగిందని, ఇంత జరుగుతున్నా డీఎంకే ప్రభుత్వం పట్టించుకోవడం లేదని, గవర్నర్ జోక్యం చేసుకుని మాదక ద్రవ్యాల నిరోధానికి కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ వినతిపత్రం సమర్పించారు. అందులో డీఎంకే ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుండి ఇప్పటి వరకు వివిధ ప్రాంతాల్లో పట్టుబడిన మాదక ద్రవ్యాల వివరాలు, ఆ కేసుల్లో డీఎంకే నేతలకు ఉన్న సంబంధాల వివరాలు కూడా పేర్కొన్నారు.

స్వేచ్ఛగా మాదక ద్రవాల వినియోగం...

రాష్ట్రంలో అన్ని చోట్లా మాదక ద్రవ్యాలు సులువుగా లభిస్తున్నాయని, యువత వాటిని ఉపయోగిస్తూ మత్తులో జోగుతోందని ఈపీఎస్ ఆవేదన వ్యక్తం చేశారు. గవర్నర్‌తో భేటీ అయిన తర్వాత రాజ్‌భవన్ వెలుపల ఆయన విలేకరులతో మాట్లాడుతూ... రాష్ట్రంలో మాదక ద్రవ్యాల అక్రమ రవాణా కేసులు అధికమయ్యాయన్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే యువత మత్తుకు బానిసైపోతుందని వాపోయారు. రాష్ట్రంలో మాదక ద్రవ్యాల వినియోగం గురించి, వాటికి సంబంధించి ఇప్పటివరకూ నమోదైన కేసులు గురించి, ప్రభుత్వం అచేతనంగా ఉండడంపై గవర్నర్‌కు ఫిర్యాదు చేశామని చెప్పారు. మాదక ద్రవ్యాలను నిరోధించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందన్నారు. మాదకద్రవ్యాల స్మగ్లింగ్‌లో డీఎంకే నేతలకు సంబంధాలు ఉన్నాయనడానికి ఇటీవల నమోదైన కేసులు రుజువు చేస్తున్నాయని చెప్పారు.



గవర్నర్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న ఈపీఎస్ తదితరులు

రేపు బీజేపీ ధర్నా

పెరంబూర్: రాష్ట్రంలో విచ్చలవిడిగా జరుగుతున్న మాదక ద్రవ్యాల చెలామణి అరికట్టేలా రాష్ట్రప్రభుత్వం చర్యలు చేపట్టాలని కోరుతూ బీజేపీ ఆధ్వర్యంలో ఈనెల 12వ తేది నగరంలో ధర్నా చేపట్టనున్నారు. ఈ మేరకు ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై పేర్కొన్నారు. మంగళవారం మధ్యాహ్నం 3.30 గంటలకు వళ్లువర్‌కోట్టం వద్ద ధర్నా చేపట్టనున్నట్లు తెలిపారు.

సమాచార దర్శిని

మూడు వేల బస్సుల కొనుగోలుకు టెండర్ల ఆహ్వానం

పెరంబూర్, మార్చి 10: రాష్ట్ర రవాణా శాఖ ఈ ఏడాది 3 వేల కొత్త బస్సుల కొనుగోలుకు టెండర్లు ఆహ్వానించింది. ఈ ఏడాది బడ్జెట్‌లో కొత్త బస్సులు కొనుగోలుకు ప్రభుత్వం నిధులు కేటాయించింది. ఆ ప్రకారం, 1,190 సిటీ బస్సులు, 672 సిటీలో ఫ్లోర్ బస్సులు, 1,138 సబర్బన్ అని మొత్తం 3,000 బస్సుల కొనుగోలు చేయనున్నారు. ప్రస్తుతం కాలం చెల్లిన బస్సుల స్థానంలో వచ్చే ఆర్థిక సంవత్సరంలో కొత్త బస్సులు వినియోగించాలని రవాణా శాఖ నిర్ణయించింది.

ఏప్రిల్ 13 నుంచి టెన్త్ మూల్యాంకనం

పెరంబూర్, మార్చి 10: రాష్ట్ర పాఠ్య ప్రణాళికలో టెన్త్ పబ్లిక్ పరీక్షలు ఈనెల 26వ తేది నుంచి ప్రారంభం కానున్నాయి. ప్రతిరోజు పరీక్ష అనంతరం జవాబు పత్రాలను సాయుధ పోలీసుల భద్రత మధ్య స్ట్రాంగ్ రూంలకు తరలించనున్నారు. పరీక్షలు ముగిసిన వెంటనే జిల్లా కేంద్రాల్లో ఏర్పాటు చేసిన కేంద్రాలకు జవాబు పత్రాలను తరలించి మూల్యాంకనం చేపట్టనున్నారు. ఈ నేపథ్యంలో, టెన్త్ పబ్లిక్ పరీక్షల మూల్యాంకనం ఏప్రిల్ 13న ప్రారంభమై 22వ తేదీతో ముగించాలని ప్రభుత్వ పరీక్ష శాఖ ఉత్తర్వులు జారీ చేసింది.

'నీట్' దరఖాస్తు గడువు పొడిగింపు

పెరంబూర్, మార్చి 10: 'నీట్' పరీక్ష దరఖాస్తు సమర్పణ గడువు పొడిగించారు. దేశవ్యాప్తంగా వైద్యకళాశాలల్లో అడ్మిషన్లకు నీట్ నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. వచ్చే విద్యా సంవత్సరానికి యూజీ వైద్యకోర్సుల ప్రవేశానికి మే 5వ తేది నీట్ నిర్వహించనుండగా, పరీక్షా ఫలితాలు జూన్ 14వ తేది విడుదల కానున్నాయి. ఈ పరీక్షకు విద్యార్థుల దరఖాస్తు సమర్పణ గత నెల 9వ తేది ప్రారంభమై ఈనెల 9న శనివారంతో ముగిసింది. ఈ నేపథ్యంలో, దరఖాస్తు సమర్పణ గడువు ఈనెల 16వ తేది రాత్రి 10.50 గంటల వరకు పొడిగించగా, అందుకు సంబంధించిన రుసుం రాత్రి 11.50 లోపు చెల్లించాలని జాతీయ పరీక్షల ఏజెన్సీ పేర్కొంది.

రూ.2.50 తగ్గిన సీఎన్‌జీ గ్యాస్ ధర

పెరంబూర్, మార్చి 10: కిలో సీఎన్‌జీ రూ.86కు విక్రయమవుతోంది. శనివారం వరకు కిలో రూ.88.50 ఉండగా, ఆదివారం నుంచి రూ.2.50 తగ్గింది. తిరువళ్లూర్ జిల్లా ఎన్నూర్ హార్బర్ ప్రాంగణంలో ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్‌కు ద్రవ సహజ వాయువు టెర్మినల్ ఉంది. విదేశాల నుంచి నౌకల ద్వారా ఎల్ఎన్‌జీ దిగుమతి అవుతోంది. ఇక్కడి నుంచి గృహాలకు పైప్డ్ నేచురల్ గ్యాస్, వాహనాలకు కంప్రెస్డ్ నేచురల్ గ్యాస్(సీఎన్‌జీ) పేరుతో విక్రయిస్తుంటారు. టొరొంటో గ్యాస్ సంస్థ ద్వారా చెన్నై, తిరువళ్లూర్ జిల్లాల్లో 67 సీఎన్‌జీ కేంద్రాల ద్వారా ఆటోలు, కార్లు ఇతర వాహనాలకు గ్యాస్ నింపుతుంటారు. కిలో సీఎన్‌జీ ధర శనివారం నుంచి రూ.2.50 తగ్గి రూ.86కు విక్రయమవుతోంది.

ఎయిడెడ్ పాఠశాలల్లో అల్పాహార పథకం

ప్యారీస్, మార్చి 10: రాష్ట్రంలోని ఎయిడెడ్ పాఠశాలల్లో 1 నుంచి 5వ తరగతి వరకు చదువుకుంటున్న పిల్లలకు అల్పాహారం పంపిణీ చేయనున్నట్లు రాష్ట్రప్రభుత్వం ప్రకటించింది. రాష్ట్రవ్యాప్తంగా 31,008 ప్రభుత్వ ప్రాథమిక, మాధ్యమిక పాఠశాలల్లో అల్పాహార పథకం అమలవుతున్న విష యం తెలిసిందే. ఈ పథకాన్ని సుమారు 2.5 లక్షల మంది విద్యార్థినీ, విద్యార్థులు చదువుకుంటున్న ఎయిడెడ్ పాఠశాలలకు కూడా విస్తరించేందుకు ప్రభుత్వ ప్రాథమిక విద్యాశాఖ చర్యలు చేపట్టింది. ఉదయం పూట విద్యార్థులకు అల్పాహారం తయారీకి అవసరమైన బియ్యం, పప్పుధాన్యం, కూరగాయలు, ఇతర వస్తువులు భద్రపరిచేందుకు అవసరమైన స్థలం, వంట మనుషులను సిద్ధం చేసుకోవాల్సిందిగా ఎయిడె డ్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు ప్రాథమిక విద్యాశాఖ డైరెక్టర్ ఎస్.కన్నప్పన్ ఉత్తర్వులు జారీ చేశారు.

తుపాకులు అప్పగించండి

పెరంబూర్, మార్చి 10: జాతీయ ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం, ఎన్నికల నోటిఫికేషన్ వెలువడిన వెంటనే, లైసెన్స్ కలిగిన యజమానులు తమ తుపాకులు పోలీస్‌స్టేషన్లలో అప్పగించాల్సి ఉంది. ఎన్నికలు ముగిసిన తర్వాత లేఖ చూపించి వాటిని తిరిగి తీసుకెళ్లాలి. ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైన 10 రోజుల్లో తుపాకులు అప్పగించాలి. లోక్‌సభ నోటిఫికేషన్ త్వరలో వెలువడనున్న నేపథ్యంలో, పోలీసులు ముందస్తు చర్యలు చేపట్టారు. ఒక్కో పోలీస్‌స్టేషన్ పరిధిలో తుపాకి లైసెన్స్ ఉన్న వారి జాబితా సిద్ధం చేస్తున్నారు. ఎన్నికల నోటిఫికేషన్ తర్వాత తమ తుపాకులు సంబంధిత పోలీస్‌స్టేషన్‌లో అప్పగించాల ని వాటి యజమానుల సెల్‌ఫోన్‌కు ఎస్ఎంఎస్ పంపుతున్నారు.

రెండో రోజూ కొనసాగిన ఈడీ తనిఖీలు

చెన్నై, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక పోయెస్ గార్డెన్‌లోని డీపీఐ డిప్యూటీ ప్రధాన కార్యదర్శి ఆదవ్ అర్జున్ నివాసంలో రెండో రోజూ ఈడీ అధికారులు తనిఖీలు జరిపారు. రాష్ట్రంలో ఇసుక క్వారీల్లో నాలుగు వేల కోట్లకు పైగా జరిగిన అవినీతి కేసులపై విచారణలో భాగంగా ఈడీ అధికారులు శనివారం నగరంలో రేషన్‌షాపులకు పప్పుదినుసులను సరఫరా చేసే కాంట్రాక్టర్ సెల్వరాజ్ ఇంట్లో, వేప్పేరిలోని పారిశ్రామికవేత్త ఇరానీ నివాసగృహం, డీపీఐ నేత ఆదవ్ అర్జున్ నివాసగృహం సహా పది చోట్ల తనిఖీలు నిర్వహించిన విషయం విదితమే. తొమ్మిది చోట్ల జరిపిన తనిఖీలు పూర్తయినట్లు ఈడీ అధికారులు ప్రకటించారు. అయితే డీపీఐ నేత ఆదవ్ అర్జున్ నివాసంలో ఆదివారం ఈడీ అధికారులు తనిఖీలు కొనసాగించారు. ఆ సందర్భంగా కీలకమైన దస్తావేజులు స్వాధీనం చేసుకున్నారు.

పారంపర్య 'పారి వేట'లో గ్రామస్తులు



పక్షుల వేటకు వెళ్తున్న గ్రామస్తులు

ఐసిఎఫ్, మార్చి 10: శివగంగ జిల్లా తిరుపత్తూర్ సమీపం కాట్టాంబూర్‌లో పారంపర్య పారి వేటలో గ్రామస్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. శివరాత్రి మూడో రోజున అడవుల్లోకి వెళ్లి పక్షులను వేటాడి వాటితో విందు భోజనం చేసేలా పారంపర్యంగా పార్వేటను ఈ గ్రామస్తులు నిర్వహిస్తుంటారు. ప్రస్తుతం పక్షుల వేటకు ప్రభుత్వం నిషేధం విధించిన నేపథ్యంలో, పారంపర్య కార్యక్రమంలో పాల్గొన్న గ్రామస్తులు ఆయుధాలు లాంటివి తీసుకెళ్లకుండా కర్రలు, తాళ్లతో అడవిలో వెళ్లి వేటలో ఉత్సాహంగా పాల్గొన్నారు.

హాస్టల్ నుంచి ముగ్గురు బాలికల అదృశ్యం

పెరంబూర్, మార్చి 10: తిరుప్పూర్ జిల్లాలో ముగ్గురు విద్యార్థినులు శనివారం సాయంత్రం హాస్టల్ నుంచి అదృశ్యమయ్యారు. హాస్టల్ అధికారుల ఫిర్యాదుతో పోలీసులు విద్యార్థినుల కోసం గాలిస్తున్నారు.

ఘనంగా శ్మశాన కొల్ల



మేకపిల్ల గొంతును నోట కరుస్తున్న అంకాళపరమేశ్వరి వేషధారి



నేలపై పడుకున్న భక్తులను దాటుకుని వెళుతున్న వేషధారి

చెన్నై, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): సేలం నగరంలో మాసి అమావాస్య సందర్భంగా ఆదివారం ఉదయం నిర్వహించిన శ్మశాన కొల్ల ఊరేగింపు ఆద్యంతం గగుర్పాటు కలిగించింది. మహాశివరాత్రి తర్వాత వచ్చే మాసి అమావాస్య రోజున సేలం జిల్లా వ్యాప్తంగా శ్మశాన కొల్ల నిర్వహించడం ఆనవాయితీ. సేలంలో మహాకాళి వేషాన్ని ధరించినవారంతా కోడిపుంజులు, మేకపోతుల మెడలను కొరుకుతూ డప్పులు, మంగళ వాయిద్యాలకు అనువుగా నృత్యం చేస్తూ ఊరేగారు. నగరంలోని అంకాళమ్మ ఆలయాలు సహా పెరియాండిచ్చి అమ్మవారి ఉత్సవ మూర్తులను శ్మశాల వరకు ఊరేగించారు. ఈ సందర్భంగా పులువురు భక్తులు కాళి, అంకాళపరమేశ్వరి వేషాలు ధరించి నృత్యం చేస్తూ మేకలు, కోడిపుంజుల మెడలు కొరికి నృత్యం చేయడం గగుర్పాటుకు గురి చేసింది. కొంతమంది భక్తులు శ్మశానంలో మనిషి పుర్రెలు, ఎముకలను పట్టుకుని నృత్యం చేశారు.

భక్తిశ్రద్ధలతో గాయత్రి సహస్రనామ స్తోత్రం



గాయత్రి సహస్రనామ స్తోత్ర పారాయణంలో పాల్గొన్న జపతులు

ప్యారీస్, మార్చి 10: స్థానిక ఈసీఆర్ రోడ్డులోని ఉద్దండి సముద్రతీరంలో ఉన్న మత్స్యనారాయణ దేవాలయంలో విశ్వశాంతిని కాంక్షిస్తూ గాయత్రి సహస్రనామ స్తోత్ర పారాయణం ఆదివారం ఉదయం నిర్వహించారు. హైదరాబాద్‌కు చెందిన కేసీ దాస్ స్మారక సేవా సంస్థ ఆధ్వర్యంలో ఉదయం 7 నుంచి 9 గంటల వరకు జపతులు ప్రత్యక్ష సామూహిక ప్రాతః సంధ్యా వందనం, సామూహిక గాయత్రి జపం నిర్వహించారు. బ్రహ్మశ్రీ కల్వకొలను శ్రీరామచంద్రమూర్తి మార్గదర్శనతో అయోధ్యలో 2024 జూలై 27 నుంచి 31వ తేది వరకు జరుగబోయే గాయత్రి శతకోటి మహా మంత్రం జప యజ్ఞం దిగ్విజయం చెందాలని ప్రార్థించారు. చెన్నై మండల సమన్వయకర్త పోరూరి శ్రీనివాసరావు, దేవులపల్లి రాధాకృష్ణమూర్తి, పూల శ్రీకాంత్, శ్రీధర్ బూమరాజు, నాగ సంపత్ కుమార్ తదితరులు సంధ్యా వందనంలో పాల్గొన్నారు.

జాలర్ల సమస్యకు పరిష్కారం చూపండి

● టీఎంసీ అధ్యక్షుడు జీకే వాసన్

ఐసిఎఫ్, మార్చి 10: శ్రీలంక నావికదళం రాష్ట్ర జాలర్లపై సాగిస్తున్న అమానుషదాడులను అడ్డుకొనేలా చర్యలు చేపట్టాలని తమిళ మానిల కాంగ్రెస్ అధ్యక్షుడు జీకే వాసన్ కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలకు విజ్ఞప్తి చేశారు. నడుదీవి ప్రాంతంలో చేపల వేట సాగిస్తున్న జాలర్లను శ్రీలంక నావికాదళం అరెస్ట్ చేసి, వారి పడవలు స్వాధీనం చేసుకుంది. ఈ విషయమై జీకే వాసన్ ఆదివారం విడుదల చేసిన ప్రకటనలో... శ్రీలంక జైళ్లలో ఉన్న రాష్ట్ర జాలర్లను విడిపించేలా కేంద్ర ప్రభుత్వం వెంటనే శ్రీలంక ప్రభుత్వంతో చర్చలు జరపాలని, చేపల వేట సాగిస్తున్న జాలర్లకు తగిన భద్రత కల్పించేలా కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు చర్యలు చేపట్టాలని జీకే వాసన్ విజ్ఞప్తి చేశారు.

గంజాయి విక్రేతల అరెస్టు

అడయార్, మార్చి 10: స్థానిక తండయారుపేటలో గంజాయి విక్రయించిన ఆరుగురిని నగర పోలీసులు అరెస్టు చేశారు. వీరి నుంచి 12 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. మింట్ రోడ్డు, వాల్‌టాక్స్ రోడ్డుల్లో కొందరు గంజాయి విక్రయిస్తున్నట్టు సెవెన్‌వెల్స్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ రమేష్ కన్నన్‌కు సమాచారం వచ్చింది. దీంతో ఆయన సారథ్యంలో ప్రత్యేక బృందం ఆయా ప్రాంతాల్లో మఫ్టీలో నిఘా సారించారు. ఆ సమయంలో అనుమానాస్పదంగా తిరుగుతున్న వ్యక్తిని అదుపులోకి తీసుకుని బ్యాగును తనిఖీ చేయగా 12 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఆ వ్యక్తిని మదురైకు చెందిన కృష్ణన్‌గా గుర్తించారు. ఈ వ్యక్తి ఇచ్చిన సమాచారం మేరకు రామనాథపురం జిల్లాకు చెందిన జగన్, శివగంగైకు చెందిన ఆనంద్ మురుగన్, చెపాక్కంకు చెందిన సికిందర్, మదురైకు చెందిన ఘని, ఎంటీసీలో పనిచేసే తిరుచ్చికి చెందిన రాధాకృష్ణన్‌ని అరెస్టు చేశారు అలాగే, సేలం కేంద్ర కారాగారంలో నిర్వహించిన తనిఖీల్లో ఖైదీల నుంచి గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.

హాన్స్ విక్రయించిన కేసులో...

కొరుకుపేటలో హాన్స్, మావా వంటి నిషేధిత పొగాకు ఉత్పత్తులను విక్రయించిన భారతీయ జనతా పార్టీకి చెందిన నాయకుడితో పాటు నలుగురిని నగర పోలీసులు అరెస్టు చేశారు.కొరుకుపేటలోని నైనియప్పన్ వీధిలోని కిరాణా షాపులో హాన్స్, మావా వంటి ఉత్పత్తులను విక్రయిస్తున్నట్టు పోలీసులకు సమాచారం అందింది. దీంతో ప్రత్యేక బృందం ఆ దుకాణంలో తనిఖీలు నిర్వహించింది. కేశవ శిఖామణి వీధికి చెందిన పచ్చైయమ్మాళ్‌ను అరెస్టు చేసింది. ఆమె నివాసంలో 25 కిలోల హాన్స్, 2 కిలోల మావా, 30 కిలోల జర్దాను స్వాధీనం చేసుకుంది. ఆమె ఇచ్చిన సమాచారం మేరకు... అదే వీధిలో నివసించే బీజేపీ నాయకుడు, విభాగ కోశాధికారి రాజేంద్రన్, లోకేష్, నరేందర్ అనే నలుగురికి సంబంధం ఉన్నట్టు తేలడంతో వారిని కూడా అరెస్టు చేశారు. వీరిపై కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నారు.

రాష్ట్రాభివృద్ధికి ప్రధాని మోదీ ఆసక్తి

● మధ్యప్రదేశ్ మాజీ సీఎం శివరాజ్‌సింగ్ చౌహాన్



సమావేశంలో ప్రసంగిస్తున్న శివరాజ్ సింగ్ చౌహాన్

వేలూరు, మార్చి 10: రాష్ట్రాభివృద్ధికి ప్రధాని నరేంద్ర మోదీ పలు పథకాలు అమలు చేస్తున్నట్లు మధ్యప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ తెలిపారు. బీజేపీ పార్లమెంటరీ ఇన్‌చార్జుల సమావేశం నగరంలో ఆదివారం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న చౌహాన్ మాట్లాడుతూ... ప్రపంచంలోనే అభివృద్ధి చెందుతున్న దేశంగా భారత్ నిలిచేలా అన్ని రంగాలను ప్రధాని మోదీ అభివృద్ధి చేస్తున్నారన్నారు. కొత్త పార్లమెంటు భవనంలో రాజదండం ఏర్పాటుచేయడం రాష్ట్రానికి ఇచ్చే ప్రాధాన్యం తెలుస్తుందన్నారు. రాష్ట్రంలో అవినీతి పాలన సాగుతోందని, పలువురు మంత్రులు అవినీతిలో చిక్కుకున్నారని, వారిలో ఓ మంత్రి జైలుపాలయ్యారన్నారు. దేశాన్ని విభజించేందుకే కాంగ్రెస్ ఎంపీ రాహుల్ పాదయాత్ర చేపట్టారని దుయ్యబట్టారు. పార్టీ ప్రధాన కార్యదర్శి కాత్యాయని సహా పలువురు నేతలు పాల్గొన్నారు.

లోక్‌సభ ఎన్నికల్లో డీఎంకే కూటమిదే ఘనవిజయం

● ఎంపీ దయానిధి మారన్



లబ్ధిదారులకు సహాయాలు అందిస్తున్న ఎంపీ

ప్యారీస్, మార్చి 10: లోక్‌సభకు జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో తమిళనాడు, పుదుచ్చేరి రాష్ట్రాల్లోని 40 నియోజకవర్గాల్లో డీఎంకే కూటమి అన్ని స్థానాల్లో ఘనవిజయం సాధిస్తుందని ఎంపీ దయానిధి మారన్ ధీమా వ్యక్తం చేశారు. హార్బర్ శాసనసభ నియోజకవర్గంలో ఆదివారం ముఖ్యమంత్రి స్టాలిన్ జన్మదిన వేడుకలను పురస్కరించుకొని 700 మంది పేదలకు సహాయాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో హార్బర్ డీఎంకే ప్రాంతీయ కార్యదర్శి ఎస్.మురళి, జె.హరికుమార్ తదితర పార్టీ నాయకులు పాల్గొన్నారు.

పార్శిల్ అందించడంలో జాప్యం

● హోటల్ యజమానిపై దాడి

ఐసిఎఫ్, మార్చి 10: విరుదునగర్ జిల్లా మారనేరిలో పార్శిల్ ఆహారం అందించడంలో జాప్యం జరిగిందంటూ హోటల్ యజమానిపై ఇద్దరు యువకులు కత్తి, రాళ్లతో దాడి చేవారు. ఈ ఘటన శనివారం రాత్రి చోటుచేసుకుంది. బాధితుడి ఫిర్యాదుతో ఆ ప్రాంతంలోని సీసీ కెమెరా ఫుటేజీ ఆధారంగా పోలీసులు వారి కోసం గాలిస్తున్నారు. హోటల్ యజమానిపై దాడి చేస్తున్న యువకులను అడ్డుకున్న పలువురు ప్రజలపై వారు దాడి చేసినట్లు పోలీసులు తెలిపారు.

అంకాళమ్మ ఆలయ అగ్నిగుండ మహోత్సవం



అగ్నిగుండ ప్రవేశంలో భక్తులు

పెరంబూర్, మార్చి 10: తిరుప్పూర్ జిల్లా పల్లడంలో ప్రసిద్ధిచెందిన అంకాళమ్మ అమ్మవారి ఆలయ 49వ వార్షిక గంధ మహోత్సవం ఆదివారం వైభవంగా జరిగింది. ఈ ఉత్సవాలు ఈనెల 7వ ప్రారంభమయ్యాయి. ఈక్రమంలో మహాశివరాత్రి, శ్మశానకొల్ల, మహా దీపారాధనలు నిర్వహించారు. శనివారం సాయంత్రం 2 అడుగుల వెడల్పు, 45 అడుగుల పొడవుతో అగ్నిగుండాన్ని సిద్ధం చేశారు. ఆదివారం ఉదయం 7 గంటలకు అగ్నిగుండ ప్రవేశం నిర్వహించగా, తొలుత ఆలయ పూజారులు ప్రవేశం చేశారు. అనంతరం 'ఓం శక్తి...పరాశక్తి' దివ్య నామస్మరణల మధ్య వందలాది మంది భక్తులు అగ్నిగుండ ప్రవేశం చేశారు. 8 గంటలకు అగ్ని అభిషేకాలు, పొంగళ్లు పెట్టారు.

ఊటీలో పర్యాటకుల సందడి



ఊటీ బొటానికల్ పార్కులో పర్యాటకులు

పెరంబూర్, మార్చి 10: ప్రపంచ ప్రసిద్ధ పర్యాటక కేంద్రం నీలగిరి జిల్లా ఊటీ ఆదివారం పర్యాటకులతో సందడిగా మారింది. రాష్ట్ర వ్యాప్తంగా కొద్దిరోజులుగా ఎండ తీవ్రత పెరగడంతో ప్రజలు సేదతీరేందుకు చల్లటి ప్రదేశాలకు వెళుతున్నారు. ఈ నేపథ్యంలో, ఆదివారం సెలవు దినం కావడంతో రాష్ట్రంతో పాటు కర్ణాటక, ఆంధ్ర తదితర రాష్ట్రాలకు చెందిన పర్యాటకులు ఊటీకి పెద్దసంఖ్యలో తరలివచ్చారు. బొటానికల్ పార్కులో ఇప్పుడిప్పుడే పూలు పూస్తున్న మొక్కల ముందు సెల్ఫీ తీసుకుంటూ ఆనందంగా గడిపారు. ఇక, బోట్ క్లబ్ వద్ద చాలా సేపు వేచిన పర్యాటకులు పడవ సవారీ చేస్తూ ఉల్లాసంగా గడిపారు.

అడవుల్లో కార్చిచ్చు ఆర్పడంపై శిక్షణ




విద్యార్థులకు శిక్షణ ఇస్తున్న అగ్నిమాపక సిబ్బంది

పెరంబూర్, మార్చి 10: స్థానిక ఒరగడం సమీపంలో అడవుల్లో ఏర్పడే కార్చిచ్చు సహా మంటలను అదుపుచేసేందుకు అగ్నిమాపక, అటవీ శాఖలు సంయుక్తంగా ప్రభుత్వ ఐటీఐ విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. వేసవిలో అడవులు నిప్పంటుకోవడం జరుగుతుంటోంది. ఈ మంటలు అదుపుచేసేందుకు అగ్నిమాపక, అటవీ శాఖ సిబ్బంది అహర్నిశలు శ్రమిస్తుంటారు. ఈ నేపథ్యంలో, మంటలను అదుపుచేయడంపై విద్యార్థులకు శిక్షణ ఇవ్వాలని అధికారులు నిర్ణయించారు. ఒరగడం ప్రభుత్వ ఐటీఐకి చెందిన సుమారు 20 మంది విద్యార్థులను అటవీ శాఖ అధికారులు సమీపంలోని అడవిలోకి తీసుకెళ్లి, మంటలు ఆర్పడంపై శిక్షణ ఇస్తున్నారు.

మండుతున్న ఎండలు

● చిన్న గొడుగులతో విధుల్లో తేయాకు కార్మికులు



పెరంబూర్, మార్చి 10: మార్చిలోనే ఎండ తీవ్రమవుతోంది. ఉదయం 11 గంటల నుంచే మండుతున్న ఎండలతో దినసరి, వ్యవసాయ కార్మికులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో, నీలగిరి జిల్లాలో ప్రధాన వృత్తిగా కొనసాగుతున్న తేయాకు తోటల్లో పాల్గొనే కార్మికులు ఎండ వేడిమి నుంచి ఉపశమనం పొందేలా ప్రత్యేక వసతి ఏర్పాటు చేసుకున్నారు. చిన్న గొడుగులను తలపై ఉంచుకొని ఎండ నుంచి తప్పించుకుంటూ పనులు చేస్తున్నారు.

'ఆంథోని దివ్య' పేరు
ఆలయంలో వివాహానికి నిరాకరణ



ఆలయం వెలుపల వివాహం నిర్వహిస్తున్న దృశ్యం

పెరంబూర్, మార్చి 10: తూత్తుకుడి శివాలయంలో జరగాల్సిన వివాహం, వధువు పేరు క్రైస్తవ పేరుగా ఉండడంతో దేవాదాయ శాఖ అధికారులు నిరాకరించారు. తూత్తుకుడి జిల్లా కుళత్తూర్ పనయూర్‌కు చెందిన కన్నుస్వామి కుమారుడు కన్నన్‌కు, తరువైకుళానికి చెందిన మురుగన్-రేవతి దంపతుల కుమార్తె ఆంథోని దివ్యతో వివాహం చేసేందుకు నిశ్చయించారు. ఈనెల 7న తూత్తుకుడి శంకరరామేశ్వర్ అనే శివాలయంలోని మురుగన్ సన్నిధిలో వివాహానికి ఏర్పాట్లు పూర్తిచేశారు. ఇరు కుటుంబాలు, బంధువులు ఆలయానికి చేరుకున్నారు. దేవాదాయ శాఖ అధికారులు వారి సర్టిఫికెట్లు పరిశీలించగా, వధువు పేరు ఆంథోని దివ్య అంటూ క్రైస్తవ మతానికి చెందిన పేరులా ఉండడంతో, ఆలయంలో వివాహానికి నిరాకరించారు. తాము 'హిందూ నాడార్' వర్గానికి చెందిన వారమనే సర్టిఫికెట్లు వధువు తల్లిదండ్రులు చూపినా అధికారులు అంగీకరించలేదు. దీంతో, ఆలయం వెలుపల వివాహం జరిగింది.

రూ.35 వేలు పలికిన నిమ్మపండు

ఐసిఎఫ్, మార్చి 10: శివగిరి సమీపంలోని ఆలయ పూజల్లో ఉంచిన నిమ్మపండును ఓ భక్తుడు రూ.35 వేలకు వేలంలో దక్కించుకున్నారు. ఈరోడ్ జిల్లా శివగిరి సమీపంలోని శివాలయంలో శివరాత్రి సందర్భంగా శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ వేడుక ల్లో వేలాదిమంది భక్తులు పాల్గొని స్వామిని దర్శించుకున్నారు. ఈ పూజలో ఉంచిన నిమ్మపండు సహా పలు వస్తువులను వేలం వేశారు. వేలంలో భక్తులు పోటీపడి వస్తువులను దక్కించుకున్నారు. ఆ వస్తువుల్లో నిమ్మపండును రూ.35 వేలకు ఓ భక్తుడు వేలంలో చేజిక్కించుకున్నారు.

డీఎంకేను నాశనం చేస్తామన్నవారంతా
పత్తాలేకుండా పోయారు

● మంత్రి కేఎన్ నెహ్రూ

పెరంబూర్, మార్చి 10: డీఎంకేను నాశనం చేయాలనుకొనేవారంతా పత్తా లేకుండా పోయారని మంత్రి కేఎన్ నెహ్రూ చెప్పారు. మదురైలో శనివారం రాత్రి సీఎం స్టాలిన్ జన్మదినం, బడ్జెట్ ప్రధానాంశాలు తెలియజేసేలా బహిరంగ సభ నిర్వహించారు. ఈ సభలో మంత్రి మాట్లాడుతూ... సీఎం స్టాలిన్ మహిళల అభ్యున్నతికి కృషి చేస్తున్నారన్నారు. మహిళలకు సాధికారిక నిధిగా నెలకు రూ.1,000, ప్రభుత్వ బస్సుల్లో ఉచిత ప్రయాణం, ఉన్నత విద్యనభ్యసించే విద్యార్థినులకు నెలకు రూ.1,000 తదితర పథకాలు అమలు చేస్తూ, దేశంలోని ఉత్తమ ముఖ్యమంత్రిగా పేరుగాంచారని అన్నారు. రాష్ట్రానికి నెలకోసారి వస్తున్న ప్రధాని మోదీ, మరో ఎన్నికల సమయానికి డీఎంకే ఉండదని మాట్లాడుతున్నారని, డీఎంకేను నాశనం చేయాలనుకున్న ఎందరో కనుమరుగయ్యారన్న విషయం మోదీ గుర్తెరగాలన్నారు. రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో డీఎంకే కూటమి 40 స్థానాల్లో విజయం సాధించేలా కార్యకర్తలు కృషి చేయాలని మంత్రి పిలుపునిచ్చారు.

బీజేపీ తలుపులు తెరచినా వెళ్లేవారు లేరు

● ద్రావిడ కళగం అధ్యక్షుడు వీరమణి

ఐసిఎఫ్, మార్చి 10: బీజేపీ తలుపులు తెరచినా కూటమిలోకి వెళ్లేందుకు మనుషులు లేరని ద్రావిడ కళగం అధ్యక్షుడు వీరమణి ఎద్దేవా చేశారు. తంజావూరులో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ... రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో డీఎంకే కూటమి 40 స్థానాల్లో విజయం సాధించడం తథ్యమన్నారు. గ్యాస్ సిలిండర్‌పై రూ.100 తగ్గిస్తూ బీజేపీ చేస్తున్న ఎన్నికల డ్రామాలను రాష్ట్ర ప్రజలు నమ్మే స్థితిలో లేరని వీరమణి తెలిపారు.

రాజకీయ లబ్ధి కోసమే డీఎంకే కూటమిలో కమల్

● బీజేపీ రాష్ట్ర చీఫ్ అన్నామలై విమర్శ

ప్యారీస్, మార్చి 10: లోక్‌సభ ఎన్నికల్లో డీఎంకేకు మక్కల్ నీది మయ్యం కట్చి అధ్యక్షుడు కమలహాసన్ మద్దతు తెలియజేయడంపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు విచారం వ్యక్తం చేశారు. ప్రజలకు నిస్వార్థసేవలు అందించడమే తన లక్ష్యమని పదేపదే పలు వేదికలపై ప్రకటించిన కమల్ రాజకీయ లబ్ధి కోసం డీఎంకేతో పొత్తు కుదుర్చుకోవడం సమంజసం కాదని అన్నామలై వ్యాఖ్యానించారు. కోయంబత్తూర్ విమానాశ్రయంలో ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ... డీఎంకే పాలనలో రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణించాయని, సంఘ విద్రోహులకు అధికారపార్టీ అండగా ఉందన్నారు. రాష్ట్రప్రజలు మార్పు కోసం ఎదురుచూస్తున్నారని, అది బీజేపీ వల్ల మాత్రమే సాధ్యమన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో సాధించే విజయంతో తాము అనుకున్నది నెరవేరుస్తామన్నారు. ప్రజలు ఎదురుచూస్తున్న మార్పు తీసుకురావాలన్న ఉద్దేశంతోనే ఐపీఎస్ ఉద్యోగాన్ని కాదనుకుని తాను రాజకీయాల్లోకి వచ్చానని, ఎంపీ, ఎమ్మెల్యే కావాలన్న ఉద్దేశం తనకు లేదన్నారు. తమ లక్ష్యం 2026 అసెంబ్లీ ఎన్నికలేనని, సెయింట్ జార్జి కోటపై బీజేపీ జెండా ఎగువ వేయాలన్నా లక్ష్యంతోనే తాను రాజకీయాలు సాగిస్తున్నానని తెలిపారు. రాష్ట్రంలో బీజేపీకి 25 శాతానికి పైగా ఓటు బ్యాంక్ ఉందని, ఈ లోక్‌సభ ఎన్నికల్లో ఈ ఓటు బ్యాంక్ శాతాన్ని రెండింతలు పెంచే విధంగా ప్రధాని నరేంద్రమోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలతో ప్రచారం సాగిస్తున్నట్లు తెలిపారు. నటుడు కమల్‌హాసన్ రాజకీయాల్లో మార్పు తీసుకురావాలన్న ఉద్దేశంతోనే మక్కల్ నీది మయ్యం పార్టీని ప్రారంభించినట్లు ముందు ప్రకటించారని, అయితే ఆయన తన లక్ష్యాన్ని విస్మరించి డీఎంకేతో చేతులు కలిపారని అన్నామలై విమర్శించారు.

ఎన్ఎల్‌సీ వాటాల విక్రయం తగదు

● ఎండీఎంకే నేత వైగో

ప్యారీస్, మార్చి 10: కడలూరు జిల్లా చిదంబరంలోని నైవేలీ లిగ్నైట్ కార్పొరేషన్ (ఎన్ఎల్‌సీ) వాటాల విక్రయ నిర్ణయాన్ని కేంద్రప్రభుత్వం ఉపసంహరించుకోవాలని ఎండీఎంకే ప్రధాన కార్యదర్శి వైగో డిమాండ్ చేశారు. కేంద్రప్రభుత్వ నిర్వహణలోని సంస్థల్లో మంచి ఫలితాలు సాధిస్తున్న ఎన్ఎల్‌సీ సంస్థ తమిళనాట 50 ఏళ్లకు పైగా పని చేస్తోందని, ఎన్ఎల్‌సీ సొరంగంలో తవ్వకాలు జరిపే బొగ్గు ద్వారా థర్మల్ విద్యుత్ కేంద్రాల్లో విద్యుదుత్పత్తి విజయవంతంగా సాగుతోందన్నారు. ఎన్ఎల్‌సీ పర్మినెంట్ కార్మికులు, ఇంజనీర్లు, కాంట్రాక్ట్ కార్మికులు అని సుమారు 20 వేల మందికి పైగా పని చేస్తున్నారని తెలిపారు. వెనుకబడిన కడలూరు జిల్లాలో లాభాల బాటలో పయనిస్తున్న ఎన్ఎల్‌సీకి సంబంధించి 2023 డిసెంబరులో 79.2 శాతం వాటాల్లో 7 శాతాన్ని ఆఫర్ ఫర్ సేల్ విధానంలో కేంద్రం విక్రయించేందుకు నిర్ణయం తీసుకున్నట్లు తమకు సమాచారం తెలిసిందని, దాన్ని వెనక్కు తీసుకోవాలని వైగో డిమాండ్ చేశారు.

డీఎండీకేలో ఐటీ వింగ్ ఏర్పాటు

పెరంబూర్, మార్చి 10: డీఎండీకేలో ఐటీ వింగ్ ఏర్పాటు చేస్తున్నట్లు ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి ప్రేమలత ప్రకటించారు. ప్రస్తుతం వాట్సాప్, ఫేస్‌బుక్, ఎక్స్ సహా పలు సామాజిక మాధ్యమాలను ప్రజలు అధికంగా వినియోగిస్తున్నారని, అలాగే పార్టీ కార్యకలాపాలు, దేశీయ, అంతర్జాతీయ స్థాయిలో జరుగుతున్న మార్పులు తదితరాలను తెలుసుకొనేందుకు ప్రజలు ఆసక్తి చూపుతున్నారని ఆమె పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో, పార్టీ ఆధ్వర్యంలో ఐటీ వింగ్ ఏర్పాటు చేస్తున్నట్లు, మాజీ ఎమ్మెల్యే ఎస్.సెంథిల్‌కుమార్ నేతృత్వంలో ఆర్.అరవిందన్, కేవీ మహేంద్రన్, ఎ.తమిళరసన్, శివకుమార్ నాగప్పన్ సభ్యులుగా ఉంటారని, పార్టీ రాష్ట్ర, జిల్లా నిర్వాహకులు ఈ విభాగానికి సహకరించాలని ఆమె కోరారు.

నీట మునిగి ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు చిన్నారుల మృతి

పెరంబూర్, మార్చి 10: తూత్తుకుడి సమీపం ఊరుణిలో నీట మునిగి ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు పిల్లలు మృతి చెందారు. ఊరుణి దక్షిణ వీధికి చెందిన లక్ష్మణన్ కుమార్తెలు సత్య(13), కృష్ణవేణి(10), కుమారుడు ఇసక్కిరాజా (8) అదే ప్రాంతంలో ఎయిడెడ్ పాఠశాలలో 8,5,3 తరగతులు చదువుతున్నారు. శనివారం సెలవు రోజు కావడంతో ముగ్గురు తమ చిన్నాన్నతో కలసి సమీపంలోని చెరువుకు వెళ్లారు. చిన్నాన్న గట్టు పక్కన కూర్చొని ఉండగా, సత్య, కృష్ణవేణి, ఇసక్కిరాజా ఈత కొడుతూ లోతైన ప్రాంతంలో నీటమునిగారు. గమనించిన చిన్నాన్న, చుట్టుపక్కల వారి సాయంతో ముగ్గురిని బయటకు తీసి తూత్తుకుడి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వారిని పరిశీలించిన వైద్యులు, అప్పటికే వారు మృతి చెందినట్లు తెలిపారు. ఈ ఘటనపై తట్టపారై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ప్రమాదంలో మృతి చెందిన కానిస్టేబుల్ కుటుంబానికి రూ.25 లక్షలు

● సీఎం స్టాలిన్ ప్రకటన

పెరంబూర్, మార్చి 10: శీర్గాళి సమీపంలో ప్రమాదంలో మృతి చెందిన కానిస్టేబుల్ రాజేష్ కుటుంబానికి రూ.25 లక్షల ఆర్థికసాయం అందజేస్తున్నట్లు ముఖ్యమంత్రి స్టాలిన్ ప్రకటించారు. ఈ మేరకు సచివాలయం విడుదల చేసిన ప్రకటనలో... నాగపట్టినం జిల్లా వెల్లిపాళయం పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్ పనిచేస్తున్న రాజేష్(35) శనివారం రాత్రి మోటరు బైక్‌పై వెళుతున్న సమయంలో మైలాడుదురై జిల్లా శీర్గాళి సమీపంలో డివైడర్‌ను ఢీకొని మృతిచెందాడు. రాజేష్ మృతికి దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన సీఎం, ఆయన కుటుంబానికి రూ.25 లక్షల సాయం ప్రకటించారు.

పుదుచ్చేరి బాలికపై హత్యాచారం

● జాతీయ ఎస్సీ కమిషన్ విచారణ

పుదుచ్చేరి, మార్చి 10: పుదుచ్చేరిలో బాలికపై హత్యాచారం వ్యవహారంలో జాతీయ ఎస్సీ కమిషన్ విచారణ చేపట్టింది. ముఖ్యమంత్రి ఎన్.రంగస్వామి ఉత్తర్వుల మేరకు ఈ ఘటనపై ప్రత్యేక ఇంటెలిజెన్స్ కమిటీ ఐపీఎస్ అధికారి కలైవానన్ నేతృత్వంలో విచారణ జరుగుతోంది. ఈ కేసుకు సంబంధించి ఇప్పటివరకు ఆరుగురిని అరెస్ట్ చేశారు. ఈ నేపథ్యంలో, ఢిల్లీ నుంచి పుదుచ్చేరికి చేరుకున్న జాతీయ ఎస్సీ కమిషన్ కమిటీ సభ్యులు చిన్నారి హత్యపై విచారణ ప్రారంభించారు.

శతాధిక వృద్ధురాలి మృతి

● నేత్రదానం చేసిన కుటుంబ సభ్యులు

అడయార్, మార్చి 10: తంజావూరు జిల్లా కుంభకోణం మోతీలాల్ వీధికి చెందిన వేదవల్లి అమ్మాళ్ (110) మృతి చెందారు. ఈమె నేత్రాలను ఆమె కుటుంబ సభ్యులు దానం చేశారు. ఈ వృద్ధురాలి భర్త రామకృష్ణన్ 20 యేళ్ల క్రితం చనిపోయారు. అయితే, ఈ దంపతులకు పిల్లలు లేకపోవడంతో వేదవల్లి అమ్మాళ్‌ను తన అక్క నవనీతం వద్ద ఉంటూ వచ్చారు. ఆమె కూడా పదేళ్ల క్రితం చనిపోవడంతో నవనీతం కుమారుడు రామచంద్రన్ వద్ద ఉంటున్నారు. ఈ క్రమంలో శనివారం సాయంత్రం వేదవల్లి వయోభారంతో మరణించడంతో ఆమె నేత్రాలను దానం చేశారు.



విలేకరుల సమావేశంలో 'అమిగో గ్యారేజ్' చిత్ర బృందం

హీరోగా వస్తున్నా

● నటుడు మహేంద్రన్

తనను 30 యేళ్లుగా ఆదరిస్తున్నారని, ఇప్పుడు హీరోగా వస్తున్న తనను ఆశీర్వదించాలని నటుడు మహేంద్రన్ కోరారు. ఆయన హీరోగా తెరకెక్కిన చిత్రం 'అమిగో గ్యారేజ్'. అదిరా రాజ్ హీరోయిన్. సంగీతం బాలమురళి. నిర్మాత శ్రీనివాసన్ పీపుల్స్ ప్రొడక్షన్స్ హౌస్ బ్యానరుపై వి క్రియేషన్స్ నాగరాజన్‌తో కలిసి రూపొందించారు. ఈనెల 15న విడుదల కానుంది. యాక్షన్ రియాక్షన్ నిర్మాణ సంస్థ అధినేత జెనీష్ రాష్ట్ర వ్యాప్తంగా విడుదల చేస్తున్నారు. శనివారం రాత్రి నగరంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో హీరో మహేంద్రన్ మాట్లాడుతూ... 'కరోనా సమయంలో దర్శకుడు ఈ కథను వినిపించారు. తొలుత డాక్యుమెంటరీగా తీయాలని భావించారు. నేను సినిమా చేద్దామని చెప్పా. దర్శకుడితో పాటు ఆయన కుటుంబ సభ్యులు, స్నేహితులంతా కలిసి ఈ సినిమాను నిర్మించారు. ఇందులో ప్రతి నటీనటుడు ప్రాణం పెట్టి నటించారు' అని అన్నారు. దర్శకుడు ప్రశాంత్ నాగరాజన్ మాట్లాడుతూ.. 'ఇది నేను దర్శకత్వం వహించిన తొలి చిత్రం. దంపతులకు తొలిబిడ్డ ఎలాగో ఈ చిత్రం నాకు అలా. కథను సిద్ధం చేసి ఎదురు చూస్తున్న సమయంలో మహేంద్రన్‌ను కలిశా. అక్కడే ఈ సినిమా నిర్మాణానికి పునాది పడింది. ఆ తర్వాత నిర్మాతలను కలుసుకుని సెట్స్‌పైకి తీసుకెళ్లాం. మూడేళ్ల కష్టం ఈ చిత్రం. ప్రతి ఒక్కరికీ నచ్చుతుంది' అని చెప్పారు. నిర్మాత నాగరాజన్ మాట్లాడుతూ... 'అమిగో అంటే స్పానిష్ భాషలో ఫ్రెండ్ అని అర్థం. ఇది స్నేహితులకు సంబంధించిన సినిమా. చిత్ర నిర్మాణంలో ఎన్ని కష్టాలు ఉంటాయో తెలిసింది' అని పేర్కొన్నారు. హీరోయిన్ అదిరా రాజ్, సంగీత దర్శకుడు బాలమురళి, కెమెరామెన్ విజయకుమార్ తదితరులు ప్రసంగించారు.

డ్రగ్స్ వినియోగం వల్లే నేరాలు

● దర్శకుడు పా.రంజిత్



సమాజంలో నేరాలు పెరిగిపోవడానికి ప్రధాన కారణం డ్రగ్స్ అని ప్రముఖ సినీ దర్శకుడు పా.రంజిత్ అన్నారు. ఇటీవల పుదుచ్చేరిలో తొమ్మిదేళ్ల బాలికపై అత్యాచారం, ఆపై హత్య జరిగిన ఘటనపై ఆయన స్పందించారు. 'ఇలాంటి వార్తలు వింటుంటే చాలా భయంగా ఉంది. నాకు కూడా ఓ కుమార్తె ఉంది. పుదుచ్చేరి బాలిక అత్యాచారం, హత్య కేసు వార్త నన్ను ఎంతగానో కలిచివేసింది. విపరీతమైన భయం ఏర్పడింది. మన విద్యా సంస్థలు సరైన విద్యా బోధన చేస్తున్నాయా? అనే ప్రశ్న ఉత్పన్నమవుతోంది. డ్రగ్స్‌కు అలవాటుపడటమే ఇలాంటి నేరాలకు మూలకారణంగా ఉంది. ఇది సమాజ సమస్య. సమాజం మొత్తం బాధ్యత వహించాలి. విద్యా సంస్థలు, రాజకీయ పార్టీలు ఇలా ప్రతి ఒక్కరూ కారణమే. మనుషుల్లో అపరిపక్వతే ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడేలా చేస్తోంది. ఇలాంటి వాటిని అడ్డుకునే బాధ్యత ప్రతి ఒక్క ఒక్కరిపై ఉంది' అని అన్నారు.

చిత్రజ్యోతి



రొమాంటిక్ సన్నివేశాల్లో నటించను

● నికిలా శంకర్

తనకు హీరోయిన్‌గా నటించాలన్న ఆశ ఉందనీ, కానీ రొమాంటిక్ సన్నివేశాల్లో నటించేందుకు ఇష్టంలేదని వర్ధమాన నటి నికిలా శంకర్ అన్నారు. యూట్యూబర్‌గా గుర్తింపు తెచ్చుకున్న నికిలా... ఆ తర్వాత పలు వెబ్‌సిరీస్‌లలో నటించారు. అలాగే, 'మానాడు', 'గట్టాకుస్తీ', 'గుడ్‌నైట్', 'లవర్' వంటి సినిమాల్లో ముఖ్య పాత్రలను పోషించారు. అయితే, హీరోయిన్ ఎంట్రీపై ఆమె స్పందిస్తూ... ఇప్పటివరకు ఆరు వెబ్‌సిరీస్‌లు, పలు షార్ట్ మూవీస్‌లో నటించా. వాటిద్వారా లభించిన గుర్తింపుతోనే తొలిసారి 'మానాడు'లో నటించే అవకాశాన్ని దర్శకుడు వెంకట్ ప్రభు కల్పించారు. ఆ తర్వాత మరికొన్ని చిత్రాల్లో నటించా. ఇపుడు హీరోయిన్‌గా నటించే అవకాశాలు వస్తున్నాయి. కానీ, గ్లామర్, రొమాన్స్ సన్నివేశాల్లో నటించడం ఇష్టం లేదు. అలాంటి సన్నివేశాలు లేని సినిమా ఏదైనా వస్తే కథానాయికగా నటిస్తా. కేవలం నటనలో మాత్రమే కాదు.. డబ్బింగ్ ఆర్టిస్టుగా కూడా రాణిస్తున్నా. పాఠశాలలో చదువుకునే రోజుల్లోనే కర్ణాటక సంగీతం నేర్చుకున్నా. పాటలు కూడా పాడుతా. ఇపుడు 'తేన్‌సుడర్' అనే వెబ్‌సిరీస్‌ను తెరకెక్కిస్తున్నా. నటన ద్వారా మా తల్లిదండ్రులు గర్వపడేలా చేశా' అని పేర్కొన్నారు.

విహారయాత్రతో వదంతులకు చెక్

ప్రముఖ నటి నయనతార తన భర్త, దర్శకుడు విఘ్నేష్‌శివన్ నుంచి విడిపోతున్నారంటూ సోషల్ మీడియాలో విస్తృతంగా ప్రచారం జరిగింది. ఈ వదంతులకు నయనతార ఫుల్‌స్టాప్ పెట్టారు. తన ఇద్దరు కుమారులైన ఉయిర్, ఉలగ్, భర్త విఘ్నేష్ శివన్‌తో సౌదీ పర్యటనకు వెళ్లిన ఆమె.. అక్కడ పర్యాటక అందాలను తిలకిస్తున్నారు. అలాగే, సౌదీలో జరుగుతున్న ఫార్ములా వన్ కార్ రేసింగ్ పోటీలను ఆసక్తిగా తిలకించారు. దీనికి సంబంధించిన వీడియోను ఆమె సోషల్ మీడియాలో షేర్ చేశారు. అలాగే, సౌదీలో తన భర్తతో కలిసి రొమాంటిక్ ఫొటో షూట్‌లో పాల్గొన్నారు. ఆ ఫొటోలను ఆమె తన ఎక్స్ ఖాతాలో షేర్ చేశారు. ఈ టూర్‌తో తాము విడిపోవడం లేదని, తమ వైవాహిక బంధం ఎంతో పటిష్ఠంగా ఉందని ఆమె స్పష్టం చేశారు.



నయనతార-విఘ్నేష్ శివన్

శ్రేష్ఠమైన దానం అన్నదానమే

● ఎస్కేపీడీ ధర్మకర్త చంద్రశేఖర్



కె.రవికుమార్, డి.రవిచంద్రన్‌ను సత్కరిస్తున్న నిర్వాహకులు

ప్యారీస్, మార్చి 10: దానాలలోకెల్లా అన్నదానం అత్యుత్తమమని శ్రీ కన్యకా పరమేశ్వరి దేశస్థానం (ఎస్కేపీడీ) ధర్మకర్త కొల్లా వెంకట చంద్రశేఖర్ అభివర్ణించారు. అయోధ్య రామ మందిరం ప్రాణప్రతిష్ఠను పురస్కరించుకుని చెన్నైలోని అయోధ్య ఆర్యవైశ్య చారిటబుల్ ఫౌండేషన్, ఎస్ఏవీసీ ఫౌండేషన్, కార్తీక్ టిఫిన్ సెంటర్ సంయుక్త ఆధ్వర్యంలో జనవరి 19వ తేది నుంచి ఫిబ్రవరి 20వరకు రామ మందిరాన్ని సందర్శించేందుకు వెళ్లిన భక్తులకు మూడు పూటలా దక్షిణ భారత వంటకాలను పంపిణీ చేశారు. అంకితభావంతో ఈ సేవలందించిన కె.రవికుమార్ - రేవతి, డి.రవిచంద్రన్ - ప్రేమ దంపతులు, వంట మాస్టర్లును, వలంటీర్లును, మూడు సంస్థల సభ్యులను ఎస్కేపీడీ చారిటీస్ తరఫున ఆదివారం జార్జిటౌన్‌లోని కన్వెన్షన్ సెంటర్‌లో నిర్వహించిన అభినందన సభలో శాలువ కప్పి జ్ఞాపికలు అందజేసి ఘనంగా సత్కరించారు. ఎస్కేపీడీ ట్రస్టీలు ఊటూకూరు శరత్‌కుమార్, టీవీ రామకుమార్, దేసు లక్ష్మీనారాయణ, సీఆర్ కిశోర్‌బాబు, ఎస్ఎల్ సుదర్శనం సహా అజంతా డాక్టర్ కనిగెలుపుల శంకరరావు, అపోలో సుబ్రమణ్యం, వి.రామచంద్రన్, పసుమర్తి గిరిబాబు, కూరపాటి రామప్రభు తదితర నగర ప్రముఖులు పాల్గొని, అయోధ్య అన్నదాన కమిటీ నిర్వాహకులను అభినందించారు.

సేవలో ముందు వరుసలో ఉండేది మహిళలే

● సీబీఎఫ్ మహిళా దినోత్సవాల్లో వక్తలు



జడ విశ్వవాణిని సన్మానిస్తున్న నిర్వాహకులు

ప్యారీస్, మార్చి 10: సేవలో ముందు వరుసలో ఉండేది మహిళలేనని సీబీఎఫ్ డైరెక్టర్ డాక్టర్ జడ వసంతబాబు పేర్కొన్నారు. కొరుక్కుపేట కామరాజర్ నగర్‌లోని సీబీఎఫ్ సంఘం ఆవరణలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఆదివారం స్త్రీల సమాజం ఆధ్వర్యంలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. కె.సింధు అధ్యక్షతన బ్లెస్సీ ఇవాంజిలికల్ అండ్ సోషల్ ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి జడ విశ్వవాణి, సీనియర్ మహిళల సభ్యులను శాలువలతో, అదే విధంగా స్త్రీల సమాజం సభ్యులను జ్ఞాపికలతో ఘనంగా సత్కరించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న డాక్టర్ జడ వసంతబాబు మాట్లాడుతూ... ప్రతి ఒక్కరు కక్షతో కాకుండా క్షమాభిక్షతో జీవించాలని సూచించారు. ఆర్థిక, రాజకీయ, సామాజిక రంగాల్లో మహిళలు మరింతగా రాణించడం ద్వారా సంపూర్ణ సాధికారికత సాధించగలుగుతారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్తేరు ప్రార్థనా బృందం, దెబోరా స్త్రీల సమాజం, యూత్ ఫెలోషిప్ సభ్యులు ఉత్సాహంగా పాల్గొనగా, బ్లెస్సీ సెరాఫ్ వందన సమర్పణ చేశారు.

చిరుధాన్యంతోనే ఆయువు



పతకాలు సాధించిన వారితో ఎస్ఐసీఏ చైర్మెన్ దాము

ప్యారీస్, మార్చి 10: చిరుధాన్యాలతో తయారుచేసే వంటకాలతో సంపూర్ణ ఆరోగ్యం ఉంటుందని దక్షిణ భారత చెఫ్ అసోసియేషన్ (ఎస్ఐసీఏ) చైర్మన్ దాము పేర్కొన్నారు. జర్మనీలో జరిగిన ఐకేఏ కులినరీ ఒలంపిక్స్‌లో వంటల తయారీ పోటీల్లో బంగారు, వెండి, కాంస్య పతకాలు సాధించిన వారికి ఆదివారం చెన్నైలో అభినందన సభ నిర్వహించారు. చెఫ్ కార్తీక్ సెందిల్‌కుమార్, అమృత ఇనిస్టిట్యూట్ చైర్మన్ భూమినాథన్ తదితర ప్రముఖులు పతకాలు సాధించిన ఐదుగురిని ఘనంగా సత్కరించారు.

కాంగ్రెస్ పోటీ చేయనున్న నియోజకవర్గాలు ఇవే

ప్యారీస్, మార్చి 10: డీఎంకే కూటమిలో ప్రాతినిధ్యం వహిస్తున్న కాంగ్రెస్ పార్టీకి లోక్‌సభ ఎన్నికల్లో 9 నియోజకవర్గాలు కేటాయించారు. 'హస్తం' గుర్తుపై పోటీచేయనున్న అభ్యర్థుల ఎంపికపై దేశ రాజధాని ఢిల్లీలో ఉన్న ఆలిండియా కాంగ్రెస్ కమిటీ పెద్దలు పార్టీ సీనియర్లతో సమావేశమై చర్చిస్తున్నారు. గత జనవరిలో జరిగిన కాంగ్రెస్ నేతల సమావేశంలో 29 పార్లమెంటు నియోజకవర్గాలతో కూడిన జాబితాను డీఎంకే అధిష్ఠానానికి సమర్పించారు. ఇందులో కొత్తగా తిరునల్వేలి, తెన్‌కాశి (రిజర్వుడు), దిండుగల్, తిరువణ్ణామలై, తంజావూరు, మైలాడుదురై, పెరంబలూరు, కళ్లకుర్చి, కాంచీపురం (రిజర్వుడు), దక్షిణ చెన్నై, అరక్కోణం సహా 12 నియోజకవర్గాలను కాంగ్రెస్ పార్టీ కోరింది. గతంలో పోటీ చేసిన కరూర్, విరుదునగర్, తిరుచ్చి, తిరువళ్లూర్, కృష్ణగిరి, తేని నియోజకవర్గాలను ఈ సారి ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి కేటాయించేందుకు డీఎంకే సిద్ధంగా లేదని తెలిసింది. అందువల్ల శివగంగ, కన్నియాకుమారి, తెన్‌కాశి, విరుదునగర్, కడలూరు, ఈరోడ్, కాంచీపురం (రిజర్వుడు), మైలాడుదురై, తిరువణ్ణామలై జిల్లాలను డీఎంకే అధిష్ఠానం కాంగ్రెస్‌కు కేటాయించేందుకు నిర్ణయించినట్లు సమాచారం.

మత్తుకు బానిసలు కావొద్దు

● యువతకు గవర్నర్ పిలుపు

చెన్నై, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మాదక ద్రవ్యాల అక్రమ రవాణాను డీఎంకే ప్రభుత్వం అరికట్ట లేకపోతున్నదంటూ ప్రధాన ప్రతిపక్ష అన్నాడీఎంకే నేత ఎడప్పాడి పళనిస్వామి ఫిర్యాదు చేసిన నేపథ్యంలో గవర్నర్ రవి మత్తుమందుకు బానిస కావద్దంటూ యువతకు పిలుపునిచ్చారు. ఆ మేరకు ఆదివారం సాయంత్రం ఆయన ఓ ప్రకటన జారీ చేశారు. ఇటీవల పెద్ద ఎత్తున మాదక ద్రవ్యాలను స్వాధీనం చేసుకోవడం, ఇతర ప్రాంతాల్లో అంతర్జాతీయ మాదక ద్రవ్యాల ముఠాలకు చెందిన రాష్ట్ర వ్యక్తులు అరెస్టు కావడాన్ని బట్టి మాదక ద్రవ్యాల చెలామణీ అధికంగా ఉన్నట్లు గత కొంతకాలంగా ప్రజలలో నెలకొన్న అనుమానం నిజమైందన్నారు. రాష్ట్రంలో ఉన్నత పాఠశాలలు, కళాశాలల్లో చదివే తమ పిల్లల పరిస్థితి గురించి ఆందోళన చెందుతున్న తల్లిదండ్రులు, గత యేడాదిగా రాష్ట్రంలోని విద్యా సంస్థల ప్రాంగణాలు, వినోద సంస్థ (క్లబ్)లు తదితర చోట్ల మాదక ద్రవ్యాలు అమ్మకాలు జరుగుతుండటం పట్ల తన వద్ద మొరపెట్టుకుంటూ వచ్చారని తెలిపారు. కేంద్ర ఇంటెలిజెన్స్ తదితర సంస్థలు అంతర్జాతీయ మాదక ద్రవ్యాల స్మగ్లింగ్ ముఠా కోసం తీవ్రంగా గాలించి రాష్ట్రంలో చట్ట వ్యతిరేకంగా మాదక ద్రవ్యాల స్మగ్లింగ్‌లో కీలకపాత్ర పోషించిన వారిని గుర్తించాయన్నారు. మాదక ద్రవ్యాలకు బానిసలైతే ఘోరమైన నేరాలకు పాల్పడే అవకాశం ఉందని, అత్యవసరంగా మాదక ద్రవ్యాల మహమ్మారిని అరికట్టాల్సిన అవసరం ఉందని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చెందిన దర్యాప్తు సంస్థలు ఆ దిశగా చర్యలు చేపట్టాలన్నారు. మాదక ద్రవ్యాల స్మగ్లర్లంతా యువతనే లక్ష్యంగా చేసుకుంటారని విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలు వాటికి బానిసలు కాకుండా కాపాడుకోవాలన్నారు. విద్యా సంస్థలు తమ ప్రాంగణాలలో మత్తుపదార్థాల విక్రయం జరగకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. రాష్ట్ర ప్రజల సంక్షేమం, భవిష్యత్తు కోసం మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా కలసికట్టుగా పోరాడాలని గవర్నర్ రవి పేర్కొన్నారు.

సమయపురంలో నేత్రపర్వంగా పూల సమర్పణ వేడుకలు

ప్యారీస్, మార్చి 10: తిరుచ్చి జిల్లా సమయపురంలో ప్రసిద్ధి చెందిన మారియమ్మన్ ఆలయంలో చిత్తిరై రథోత్సవం సందర్భంగా పూల సమర్పణ వేడుకలు ఆదివారం ప్రత్యేక పూజలతో ప్రారంభమయ్యాయి. ఈ ఆలయంలో ఈ నెల 17, 24, 31 తేదీలు, ఏప్రిల్ 7 వ తేది వరకు మాసి మాసం వేడుకలు కోలాహలంగా నిర్వహించేందుకు ఆలయ అధికారులు ఏర్పాట్లు సిద్ధం చేశారు. కంకణధారణ చేసిన అమ్మవారి భక్తులు 28 రోజులు వ్రతంలో గడుపుతారు. ఈ 28 రోజులు ఆలయ గర్భగుడిలో కొలువైన అమ్మవారికి నైవేద్యం గా బియ్యం పిండి, మజ్జిగ, పానకం, నారీకేళజలం మాత్రమే సమర్పిస్తారు. ఆదివారం నిత్య పూజల అనంతరం మీన లగ్నంలో అమ్మవారికి పూల సమర్పణ వేడుకలు నిర్వహించారు. తిరుచ్చి జిల్లా ఎస్పీ వరుణ్‌కుమార్ నేతృత్వంలో సుమారు 1,300 మంది పోలీసులు భద్రతా విధులు నిర్వహిస్తున్నారు. రద్దీలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సమయపురంలో 13 వాచ్ టవర్లు ఏర్పాటు చేశారు. అదే విధంగా భక్తుల సౌకర్యార్థం సమయపురం తాల్ రోడ్డు నుంచి ఆలయం వరకు 50 ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటుచేశారు. ఆదివారాల్లో సాయంత్రం 5 నుంచి మరుసటిరోజు ఉదయం 9 గంటల వరకు రాష్ట్రం నలుమూలల నుంచి తిరుచ్చి వచ్చే వాహనాల వల్ల ట్రాఫిక్ ఇబ్బంది కలుగకుండా బైపాస్ మార్గానికి వాహనాలు మళ్లించారు. తొలిరోజు ఈ వేడుకల్లో సుమారు 5 వేల మందికి పైగా భక్తులు పూల గంపలను శిరస్సుపై ఉంచి ఊరి పొలిమేరల నుంచి పాదయాత్రగా మారియమ్మన్ ఆలయానికి తరలివెళ్లి అమ్మవారిని సేవించారు.

నమో డ్రోన్లతో మహిళలకు శిక్షణ

అడయార్, మార్చి 10: గరుడ ఏరోస్పేస్‌కు చెందిన నమో దీదీ యోజన మహిళలకు డ్రోన్ టెక్నాలజీపై శిక్షణ ఇస్తోంది. మహిళా సాధికారతలో భాగంగా, ఇప్పటికే 500 మంది మహిళా రైతులు ఈ టెక్నాలజీ ద్వారా శిక్షణ పొందారు. ఈ డ్రోన్‌లను 20 రాష్ట్రాలకు చెందిన మహిళా రైతులకు 446 డ్రోన్లను పంపిణీ చేశారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాలు జరుపుకుంటున్న వేళ... డ్రోన్ టెక్నాలజీలో మార్గదర్శక కార్యక్రమాల ద్వారా మహిళలకు సాధికారత కల్పించేందుకు గరుడ ఏరోస్పేస్ తన అచంచలమైన నిబద్ధతకు నిదర్శనంగా ఉంది. డ్రోన్ టెక్నాలజీలో సమగ్ర శిక్షణ కార్యక్రమాల ద్వారా 500 మందికి పైగా మహిళలు సాధికారత సాధించారని గరుడ ఏరోస్పేస్ గర్వంగా ప్రకటించింది. మహిళలకు అవసరమైన నైపుణ్యాలను అందించడమే కాకుండా "పురుషులకు దీటుగా అభివృద్ధి చెందేలా వాతావరణం కల్పించడం కోసం కృషి చేస్తున్నట్లు ఆ సంస్థ విడుదల చేసిన ఓ పత్రికా ప్రకటనలో పేర్కొంది.



మహిళా రైతులకు పంపిణీ చేసే డ్రోన్



అంతర్జాతీయ కిడ్నీ దినోత్సవాన్ని పురస్కరించుకుని నగరంలోని ఏషియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ నెఫ్రాలజీ అండ్ యూరాలజీ (ఏఐఎన్‌యు-ఐను) హాస్పిటల్ ఆధ్వర్యంలో రెండో ఎడిషన్ మారథాన్ పోటీలను జెండా ఊపి ప్రారంభించిన తమిళనాడు రాష్ట్ర క్రీడాభివృద్ధి సంస్థ సభ్య కార్యదర్శి మేఘునాథ్ రెడ్డి. చిత్రంలో తమిళ సినీ నటుడు సంతోష్ ప్రతాప్, ఐను హాస్పిటల్ సీవోవో చిరదీప్ దత్తు.

ఫీనిక్స్ మార్కెట్ సిటీ ఆధ్వర్యంలో మహిళల బైక్ ర్యాలీ

అడయార్, మార్చి 10: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని నగరంలోని ప్రముఖ షాపింగ్ మాల్ ఫీనిక్స్ సిటీ ఆధ్వర్యంలో ప్రత్యేకంగా మహిళల కోసం బైక్ ర్యాలీని ఆదివారం నిర్వహించింది. మొత్తం 15 కిలోమీటర్ల దూరం కొనసాగిన ఈ ర్యాలీ 'సాధికారత, ప్రేరణ, పరుగు' అనే థీంలతో నిర్వహించారు. ఈ ర్యాలీని అడయార్ రేంజ్ అసిస్టెంట్ కమిషనర్ తిరువేంగడం, గిండి ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ విజయలక్ష్మి, ఫీనిక్స్ మార్కెట్ సిటీ మార్కెటింగ్ విభాగం జీఎం ప్రశాంత్ భాష్యం, సెంటర్ డైరెక్టర్ శబరి నాయర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా శబరి నాయర్ మాట్లాడుతూ... ఈ ర్యాలీ మహిళల సాధికారత, వారి జీవిత లక్ష్యాల కోసం ఎంచుకునే స్వేచ్ఛ,శక్తివంతమైన చిహ్నంగా పని చేస్తుందన్నారు. ఫీనిక్స్ మార్కెట్ సిటీలో ఇంటర్నేషనల్ ఉమెన్స్ డే వేడుకలు జరుపుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు.



బైక్ ర్యాలీలో పాల్గొన్న మహిళలు



● మాసి అమావాస్య రామేశ్వరం అగ్ని తీర్థంలో భక్తుల రద్దీ

పెరంబూర్, మార్చి 10: మాసి అమావాస్య సందర్భంగా రామేశ్వరం అగ్ని తీర్థానికి వేలాదిమంది భక్తులు తరలివచ్చారు. రామనాథపురం జిల్లా రామేశ్వరం రామనాథస్వామి ఆలయ మాసి మహా శివరాత్రి వేడుకలకు ఈనెల 1వ తేది ధ్వజారోహణంతో ప్రారంభమయ్యాయి. ఉత్సవాల్లో ముఖ్యాంశాలైన మహా శివరాత్రి పూజలు, రథోత్సవం జరిగిన నేపథ్యంలో, ఆదివారం మాసి నెల అమావాస్య సందర్భంగా వేలాది మంది భక్తులు రామేశ్వరానికి తరలివచ్చారు. అగ్ని తీర్థంలో తమ పితరులకు తర్పణాలు, పిండ ప్రదానాలు చేశారు. అనంతరం రామనాథస్వామి ఆలయ ప్రాంగణంలోని 22 తీర్థ బావుల్లో పుణ్యస్నానాలు ఆచరించి రామనాథస్వామి, పర్వతవర్ధిని అమ్మవార్లను దర్శించుకున్నారు. అమావాస్య సందర్భంగా ఉత్సవమూర్తులు ప్రత్యేక వాహనంలో మాడవీధుల్లో విహరిస్తూ భక్తులను కటాక్షించారు. అనంతరం మధ్యాహ్నం 1.31 గంటలకు స్వామి, అమ్మవార్లను బంగారు వృషభ వాహనంలో అగ్నితీర్థానికి వేంచేపు చేసి తీర్థవారి నిర్వహించారు. సుమారు 100 మంది పోలీసులు భద్రతా విధులు చేపట్టారు.

29నుంచి ఊటీకి అదనపు కొండ రైలు సర్వీసులు

పెరంబూర్, మార్చి 10: పర్యాటక ప్రాంతం ఊటీకి వచ్చే పర్యాటకుల సౌకర్యార్థం అదనపు కొండ రైలు సర్వీసులు నడపాలని దక్షిణ రైల్వే నిర్ణయించింది. రాష్ట్రంలో ఎండ తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో, ప్రజలు సెలవు రోజుల్లో చల్లటి ప్రదేశాలకు వెళుతున్నారు. ప్రసిద్ధి వేసవి విడిది కేంద్రం ఊటీకి కోయంబత్తూర్ జిల్లా మేట్టుపాళయం నుంచి ప్రతిరోజు కొండ రైలు సేవలు అందుబాటులో ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఈనెల 29నుంచి జూలై 1వ తేది అదనపు కొండ రైలు సర్వీసులు నడపనున్నారు. ఆ ప్రకారం, వారంలో శుక్రవారం నుంచి సోమవారం వరకు నాలుగు రోజులు ఈ అదనపు సర్వీసులు అందుబాటులోకి రానున్నాయి. కున్నూర్ - ఊటీ మధ్య ఉదయం 8.20 గంటలు, ఊటీ - కున్నూరు మధ్య సాయంత్రం 4.45 గంటలకు ఈ రైలు సర్వీసులు నడుపనున్నారు. అలాగే, మేట్టుపాళయం నుంచి ఊటీకి శుక్రవారం నుంచి సోమవారం వరకు ఉదయం 9.10 గంటలు, ఊటీ నుంచి మేట్టుపాళయంకు శని, ఆదివారాల్లో ఉదయం 11.25 గంటలకు అదనపు రైళ్లు నడుపనున్నారు. ఇక, ఊటీ - గెత్తి మధ్య శుక్రవారం నుంచి శనివారం వరకు ఉదయం 9.45 గంటలు, 11.30, మధ్యాహ్నం 3 గంటలకు అదనపు రైలు సర్వీసులు అందుబాటులోకి రానున్నాయి. ఊటీ - కున్నూరు మధ్య ఐదు బోగీలతో నడిచే కొండ రైలులో 80 ఫస్ట్ క్లాస్, 130 సెకండ్ క్లాస్ అని మొత్తం 210 సీట్లు, మేట్టుపాళయం - కున్నూరు మధ్య నాలుగు బోగీలతో నడిచే కొండ రైలులో 40 ఫస్ట్ క్లాస్, 92 సెకండ్ క్లాస్ అని మొత్తం 132 సీట్లు ఏర్పాటు చేసినట్లు దక్షిణ రైల్వే తెలిపింది.



వైద్యవిద్యార్థులకు ఉపకారవేతనాలు

చెన్నై, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): మెట్రో పోలీస్ ఫౌండేషన్ సంస్థ మెడ్ ఎంగేజ్ పథకం ద్వారా ఈ యేడాది దేశవ్యాప్తంగా 301 మంది వైద్య విద్యార్థులకు రూ.1.7 కోట్ల మేరకు ఉపకార వేతనాలు పంపిణీ చేస్తున్నట్లు సంస్థ అధ్యక్షుడు డాక్టర్ దురు షా తెలిపారు. నగరంలో ఆదివారం ఉదయం ఏర్పాటైన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... రాష్ట్రంలో తమ సంస్థ 21 ల్యాబ్‌లు నడుపుతోందని, 340 చోట్ల రక్త సేకరణ కేంద్రాలు కూడా నిర్వహిస్తోందని చెప్పారు. ఆరేళ్లుగా మెడ్ ఎంగేజ్ పథకం ద్వారా విద్యా ప్రతిభ, ఆర్థిక పరిస్థితులను బట్టి ఎంపిక చేసిన వైద్య విద్యార్థులు, పరిశోధకులకు ఉపకార వేతనాలను అందిస్తున్నామని చెప్పారు. ఈ యేడాది రాష్ట్రానికి చెందిన విద్యార్థులు 30 మది దాకా ఉన్నారని తెలిపారు. ఈ సమావేశంలో మెట్రోపోలీస్ హెల్త్‌కేర్ లిమిటెడ్ సీసీఓ సురేంద్రన్, సీఎస్ఆర్ విభాగం నిర్వాహకురాలు డాక్టర్ కీర్తి చద్దా తదితరులు పాల్గొన్నారు.

ఉపకారవేతనాలు అందుకున్న వైద్యవిద్యార్థులతో సంస్థ నిర్వాహకులు

